ఎక్కడ భక్తి వుంటే అక్కడ దేవుడుంటాట్ట!

ఎక్కడ యాక్సిడెంటైతే అక్కడ పోలీసులుంటారు.

అప్పుడే పోలీసులు లారీ డ్రైవర్ని దింపేసేరు.

"అయినా ఆ గుంటడికంత మొండితనం ఏం? పట్టుకొని వదలడే జలగలాగ" అన్నారొకరు.

"ఏ౦వి౦టో వీడి చావు యిక్కడ రాసివుంది" అన్నాడో వేదాంతి.

"అసలీ లారీడ్రైవర్లకి ఒళ్ళు తెలీదండి. పట్టపగలే తాగేసి నడుపుతారు" ఒకడు వాపోయేడు. రాత్రి తాగి నడిపితే ఫరవా లేదన్నట్టు.

అంతేకాని వాడికి డబ్బుల్విక పోవడం ఆవిడ తప్పని ఒక్కరూ అన్లేదు.

కొంతసేపటికి ఆ లారీ తప్ప మిగిలినవి బయల్దేరేయి.

"నయం మన బస్సు కింద పడలేదు. అన్నెసరీ లేట్" అన్నాడు ఫుల్‌సూట్.

చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. వాడి ప్రాణం కంటే వీడి బోడి పని ఎక్కువా?

ఆ కుర్రాడ్ని తల్చుకొని నా మనసంతా అసహ్యంగా అయి పోయింది. వాడికి అమ్మా, నాన్నా వున్నారో లేదో? ఒకవేళ వాళ్ళ సంసారానికి వీడే ఆదరువేమో? వీడి తరువాత వున్న చిన్న తమ్ముళ్ళని, చెల్లెళ్ళని వీడే పోషించాలేమో, మరింక యిప్పు డెవరు దిక్కు వాళ్ళకి.

రోజూ అన్నం టైముకి పరిగెత్తుకొచ్చే కొడుకు ఆ వేళ రాడనీ, ఆ వేళే కాదు శాశ్వతంగా రాడనీ తెలిసిన ఆ తల్లి కడుపుమంట ఎవరార్పగలరు?

బస్సు మళ్ళీ కదిలింది.

**(యువ, దీపావళి 10.11.1976)**

# కన్నీళ్ళొచ్చేయి

"**వె**లిసిన చీరపువ్వులా ఆమే,
పగిలిన పాత చెప్పులా అతనూ..."
ముప్ఫై చీకటి సంవత్సరాల వెనుక
మల్లెల మేడ
వెన్నెల గదిలో
ఇంద్రధనస్సు
మంచు తెరలలో
సితారు జాజుల
సన్న జల్లులో
పూర్తి మొగాడూ
నిండైన మనిషిగా
అతనూ,
బంగారు కొమ్మ కొనని
పూసిన ఆణిముత్యంలా
విశాలాక్షీ
ఉన్నప్పుడు
"ఈ పువ్వుల పూజలు ఎన్నాళ్ళో"
"ఈ రంగుల పాటలు ఎన్నాళ్ళో"
అన్న శంకల మొసళ్ళు
తల ఎత్తక ముందే
పాటలు తెగి
పూజలు మండి
ముత్యాల ముగ్గులు
    మట్టిపాలై
    నాన్న నెత్తుకుపోయేక
    అప్పుల నక్కలు ఆరెకరాలూ
    చీక్కుపోకా
    మిగిలిన
అతను, విశాలాక్షీ

ఎండ కాల్చిన
వెన్నెల ముత్యాల్ని
గుడ్డిపూసలుగా
        చూసుకొని
పుచ్చిన కోరికల్నీ
చావని ఆశల్నీ
పాత పోపుల డబ్బాల
కెత్తుకొని
పట్నం కొట్టుకుపోతూంటే
నన్ను పెళ్ళాడినందుకు
అనడిగే లోగానే
చెంపని పూసిన రోజా
నతని నోటి కడ్డంపెట్టి
"మీతో నరకం స్వర్గ తుల్యం"
అన్న హామీ యిచ్చి
"కష్టాలు కలకాలం వుండవ్"
        అన్న ఆశ
ఆమె రగిల్చినప్పుడు కూడా
        అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ(ర్రా)లేదు.

❖ ❖ ❖

అసలు కవిత్వం
అరటావు అణాకి
మనిషి మాంసం
ఆడదానెత్తు రారణాలకీ
అద్దెకు దొరికే రోజుల్లో
అతని నౌకిరీ
        పుల్లల్లేని
పాత గొడుగనీ
వాళ్ళ ఇల్లు గృహం కాదనీ
పాత చింకి కొంపనీ
వాళ్ళ బతుకులు జీవితాలు
        కావనీ
చైతన్యం వున్న చావులనీ
వాళ్ళు దేవుడు పుట్టించిన
మనుషులు కారనీ
పిశాచాల యాగంలో
        సమిధలనీ
వాళ్ళ బండెప్పుడూ ఓడవదనీ
వాళ్ళ కావడి
        రెండు కుండల్నిండా
        కష్టాలేననీ
        తెలియక
ఆమె అన్న మాటలు
రెక్కల తేళ్ళయి
అతని మనసు కుట్టినా
శరత్తు ముందుందని
        ఈ ముప్పై ముళ్ళ
        శిఖరాల్లో
ఆశలు కాలి
అగ్గిలు ఆరి
వెలిసిన చీర పువ్వులా ఆమె,
పగిలిన పాత చెప్పులా అతనూ
        ఐనా
అతనికి దుఃఖం వచ్చింది.
కాని కన్నీ(ర్రా)లేదు.

❖ ❖ ❖

ఎదమీద కుంపట్లా
        ఎదిగిన
పాతికేళ్ళ శకుంతలకి
పెళ్ళీడు దాటిపోయిందని
ఆమెకే తెలిసిపోయినా

భరించక చేసేది లేక
"ఈ నిప్పులబాట ఎన్నాళ్ళు
ఈ రేపు లేని చీకటీ ఎన్నాళ్ళు"
ప్రభూ?
అన్న
అతనిదీ, విశాలాక్షిదీ
పలవరింతల ప్రార్థన
ప్రభు
వ్వినకపోతే
"ఇదాং నీ యినుపు శాసనం?
నీ కంచుకాలు మామీదా?"
అనడగలేక
సరెండరైపోయినప్పుడు
కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు

❖ ❖ ❖

మాసిన గోడలు యింకా మాసినట్టూ
ఉన్న కొద్ది పెంకులూ లేనట్టూ
ఉండే
తన కుక్కి గది ఒకటికీ
కట్టాల్సిన అర్నెల్లదే
తండ్రెంత చెప్పినా
అడగని
కొండ్రావెందుకడగడో
అతనికీ, శకుంతలకీ
తెలిసిపోయినా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు.

❖ ❖ ❖

ఆ మధ్య
ఖరీదైన కొత్త సిగరెట్పెట్టేలా
కొండ్రావొచ్చి
సైకిలు గంట
ఇనప గజ్జెల్లా
మోగిస్తూ
శకుంతలని
విసిగిస్తుంటే
ఆమె జాకెట్టు
ఎక్కడ చిరక్కూడదో
అక్కడ చిరిగి
పాతికేళ్ళయవ్వనం
యిరవై ఐదేళ్ళ దుఃఖంగా
పొంగినప్పుడు
మటం విప్పి ముందుకు సాగే
మచ్చల పాములా
కొండ్రావు చూపు కాటుకి
మానం వచ్చి
ప్రాణం మిగిలి
అతనూ, శకుంతలా
ఎంత ప్రార్థించినా
ఎంత అర్థించినా
భూదేవి
సవితి బిడ్డలు చేసి
ఒడి యివ్వక
"కొండ్రావ్వెధవ"
అని తిట్టే
అర్నెల్ల
అర్హత

అద్దె
అతనికి లేకపోయినప్పుడు కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు
…………
"దీన్ని వీడు లేవదీసుకుపోతే"
"ఈ పిల్లలు పిడుగుపడి ఛస్తే"
అన్న పాడాలోచనలు
పాములై మనసుని కుట్టి
గరళం కళ్ళకి దిగి
ప్రేమ ద్వేషమై
ఆశక్తి ఆవేశమై
తను తన పిల్లల్నే ఆదరించలేదని
తెలిసిన
శకుంతల
చీకట్లో ఒంటి నక్షత్రంలా
అతనింట్లో వున్నప్పుడు పెరట్లో
గజగజలాడినా
తర్వాతది
ఓణీల్లేవని
బడి మానేసి
పరికిణీలు కూడా
చాలవని తెలుసుకున్నా
తన బుసకి
కాటుకన్నా విషముందని
తెలియక, ఎదురుపడి
తన ఊపిరి సెగలో
మాడుతూ వున్నా
అతనికి దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు.

❖ ❖ ❖

మొన్న
నాన్నా పెన్సిలు…
అని ఆఖరివా దడగబోతే
పార్కరు పెన్నొద్దురా
…… కొడకా
అని అతను విసిరిన
తిట్టు
విశాలాక్షి ఎదలో పేలి
దుఃఖం
చీర చెంగు బిగించిన
నోట్లోంచి రాలేక
కళ్ళల్లో నీరై
కారి
తనని
కాల్చినా అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కనీ్రాలేదు

❖ ❖ ❖

దగ్గలేని విశాల
ఎండు గుండెల మీద
మీసాలు కలిసిన
జబ్బు పురుగులా
స్టెతస్కోపు పాకితేనే చూడలేని
తనని
మిషన్లై, మందులూ
పన్చెయని
ఎన్.జి.వొ. క్లినిక్ తాలూకు
వచ్చేసినట్టు నటించే

డాక్టరు
పి.ఏ. వ్యూఆఫ్ చెస్ట్ (P.A. view of chest)
ఎక్స్‌రే (x-ray) తీయించమంటే
తల దగ్గర ఎప్పుడూ వుండని
పదిహేన్రైపాయలూ
ఎప్పుడేనా వుంటే
విశాల ఎండు గుండెల్లో
ఏ జబ్బులేదో తెలుసుకొందుకి
ఎక్స్-రే (x-ray) తీయించాలనుకొను
ఎన్నాళ్ళీ రంగుల్లేని బతుకు?
నగనరాన్నీ పీకి
రక్తం లేని మాంసాన్ని
నమిలి నమిలి
చంపక
ఒక్క వేటుతో
మమ్మల్నందర్నీ
రాల్చేయ్
స్వామీ!
నేను విన్లేను
విశాలదగ్గ
అన్న అతని
ప్రార్థన
యముడూ, దేవుడూ
ఒక్కలాగే యిగ్నోర్ చేసినా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు.

❖ ❖ ❖

.....
మూణ్ణెల్ల క్రిందట
కాజల్ పెట్టిన
కలువ కన్నెలా
తెల్లంచు నల్లచీర
కట్టుకొచ్చిన
కొండ్రాావు చెల్లెల్ని
"ఖరీదెంత?"
అనడగకూడదనుకునే
తల్లీ కూతుళ్ళిద్దరు
వంతపాడి
"ముప్ఫయ్యా" అన్న నిరాశ
"ముప్ఫైయ్యంటే ఎంత బావుణ్ణూ!"
అని విశాలాక్షీ బైటపెట్టని
విచారం
రెండు గుండెల్నీ
నింపి
ఆ చీర
కాలం కొండ చిలువ మ్రింగిన
ఎన్ని మధురానుభూతుల్ని
బైటకు తీసి
చెరిగిన విశాలాక్షి
నవ్వులు సరిదిద్దగలదో
అతనూహించుకున్నప్పుడు
అతని గుండెల్లో
నిప్పుల కవ్వం చిలికినట్టయినా
కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు

❖ ❖ ❖

ఆ రాత్రి
"కార్లొద్దు, కనకం వద్దు
మణులొద్దు, మాన్యాలొద్దు

సిరులొద్దు, సింగారాలొద్దు"
జన్మలో
ఒక్కటంటే ఒక్కటి
తెల్లచీర నల్లంచుది
అదైనా నూల్ది
ఒక్కచీర
కొనే శక్తి ప్రసాదించు
స్వామీ
అని
మనిషి కాదన్లేని
ప్రార్థన
అతను దేవుడ్ని
చేస్తుంటే
చంద్రుళ్ళేని వెన్నెల్లా
చల్లగా
తామరలూ, కలువలూ కలిపి
కట్టినట్టు నిండుగా
విశాలాక్షి చెంతచేరి
"మణీ!"
అన్నప్పుడు
ఎప్పుడో మధురస్వప్నంలో
ఎవరో తీయగా పాడిన పాట
మళ్ళీ విన్నట్టయి
చెదపట్టిన స్మృతులు పుస్తకంలో
ఒక పేజీ వెక్కిరించినట్టు
ఆగి
పెళ్ళయిన కొత్తల్లో
తను ఎక్కువగా కోరినప్పుడు
ఆమె తననలాగే పిలిచేదని
గుర్తుకి వచ్చి.
"మనస చీకట్లో మణి అని
భ్రమించి
ముట్టుకుంటే
పామై నీ చేతికి
చుట్టుకున్నానా?"
అన్నాలోచన నొచ్చినప్పుడు
కూడా
అతనికి
దుఃఖం వచ్చి
కన్నీర్రాలేదు

❖ ❖ ❖

ఆ కాళరాత్రే
"ఈవేళ నీ పుట్టిన్రోజు
ఏమివ్వగలను
ఇది తప్ప"
అని ఆమె
ముద్దుతో
తన నుదురు కాల్చి
బైట
ఎదమీద కుంపటీ
వోణీల్లేని శారదా
లెక్కల్లాని కొడుకులూ
వున్నారని
పేనని తాడులా
విడి వెళ్ళిపోతే
బెడ్‌లైట్ ఎర్రచీకటి
తన మనసుని
చుట్టి చుట్టి చంపివేసినప్పుడూ
"విశాల దగ్గుతూనే వుంటుంది
పెద్ద పిల్లకి పెళ్ళి కాకుండానే వుంటుంది
వోణీల్లేని శారదకి పరికిణీలు చిరుగుతూనే ఉంటాయి
తర్వాత వాళ్ళకి లెక్కాల్లాకుండానే వుంటాయి
తెల్లచీర తను కొన్లేకుండానే వుంటాడు"

        అన్న ఆలోచనలు
        గుండెని కోస్తూ వుంటే
"ఈ కత్తుల పర్వతం
నే నెక్కలేను
ఈ విష సముద్రం
నే నీదలేను
ఈ నిప్పుల దారి
        నేన్నడవలేను
మాకు, చావు
నిండుగా జీవిత ధ్యేయంలా
చల్లగా తీరిని కోరికలా
        వుంటుంది
మమ్మల్నీ
కత్తెర బోనులో
నొక్కడం
నీ లాలా స్వామీ"
అని ప్రార్థించినప్పుడు
కూడా
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీర్రాలేదు.

❖ ❖ ❖

ఆ మర్నాడు
మొన్న కాలని శవంలా
రేపటి జబ్బుకి ముందొచ్చే మూలుగులా
కాకుండా
అతను
        ఒక భర్తగా
        ఒక తండ్రిగా
        ఒక మొగాడుగా
        నిద్రలేచి
పోయీా లోగా ఒక్క మంచిపని
చేస్తానన్న నమ్మకంతో
ఆఫీసులో
ఆగని బుసలాటి ఫేను చప్పుళ్ళో
కాఫీకి అరిచే పేగులు
తనవి కావనుకొని
కాల్చే కొద్ది చౌకబారు సిగరెట్లూ
యింకా కొద్దిచేసి
        రథ సప్తమినా డొచ్చే
        విశాల పుట్టిన్రోజుకి
        కొండల్రావు చెల్లెలు చీరలాంటిది
పట్నంలో
"ఇంగ్లీషు డ్రెస్ హౌస్"లో
"మూన్ డ్రీమ్ శారీ"
ఖరీదు "ముప్పయ్యే"
కొండానికి మూణ్ణెల్లల్లో
మూడు పదులు మిగిల్చినప్పుడు
        అనిర్వచనీయమైన సంతృప్తితో
        కూడా
        అతనికి
        దుఃఖం వచ్చింది
        కాని
        కన్నీర్రాలేదు

❖ ❖ ❖

పుట్టిన్రోజు ముందునాడు
పనిమీద పట్నం పంపించిన
ఆఫీసర్ని ఆశీర్వదిస్తూ
అడవి మృగాల మెరిసే కళ్ళలా
వెలిగే పట్నపు లైట్ల
మధ్య చీకట్లో
ఇంగ్లీషు డ్రెస్ హౌస్ చేరుకొని
షో కేస్లో

తెల్లదొర మట్టి శవం బొమ్మ
శాపం చూపు తగలకుండా
షాపులో కెళ్ళి
అరవ అతివ ముక్కు పుడకలో
మూరెడు ట్యూబులైటూ గుచ్చుకోకుండా
వంగి, వదిగి
దీనంగా, దైన్యంగా
హేయంగా
"తెల్ల దొరలు మళ్ళీ వచ్చేవరకూ
ఈ తెల్ల ముఖాలకి అమ్మడం"
తన శాపభాగంగా అంగీకరించిన
సింధీ షాపువాడి
నవ్వని నవ్వుల విషం
తట్టుకొని
అతను వేసిన చీరల మేట్లోంచి
తనక్కావలసిన
తెల్లచీర కొనుక్కొని
బైటపడి
సముద్రపొద్దున
కూర్చున్నప్పుడూ,
నల్ల మేగాల్లో మెదిలే చంద్రుడు
అప్సరస జుట్టు ముడిలో
వెండి పువ్వులా మెరిసి
తనమీద
ముత్యాల వాన కురిపించినప్పుడూ,
ప్రియుడికోసం పరచిన పైటలా
సముద్రం తెల్ల కెరటాలని పరచినప్పుడూ
"రేపు నాక్కూడా...
అన్న ఆశ విరిసినప్పుడూ.."
ఆఖరి బస్సులో
తిండి తినని నిండు కడుపుతో
విరిగి కల అతికిన సంతోషంతో,
తనకి
దొరికిన దంతబ్బొమ్మకి
ఉల్లిపొర కాగితం
కొనగలిగినందుకూ
నిజం దేవుడి పాదాల దగ్గర
నూనె దీపం వెలిగించలిగినందుకూ
ఆత్మ విశ్వాసంతో
దేశం మంచిదనీ
దేవుడు కరుణామయుడనీ
భక్తి, విశ్వాసాలతో,
రేప్పొద్దున స్నానం చేసేక
విశాలని సర్‌ప్రైజ్ చెయ్యవలసిన
చీర
గోడ మేకుని జూట్ హేండుబేగులో
వేలాడుతుండడం
చూస్తూ పడుకున్నప్పుడు కూడా
నిండు కోరిక
తీరిన ఆనందంతో
అతనికి
దుఃఖం వచ్చింది
కాని
కన్నీ్రాలేదు.

❖ ❖ ❖

ఆ మర్నాడుదయం
విశాల పెరట్లో స్నానం
చేస్తున్నప్పుడు
అతను
కాలెండరు దేవుడి
కాగితపు నవ్వులో
"ఇంగ్లీషు డ్రెస్ హౌస్"
కవరు చింపగానే
హృదయం చిరిగినట్టయి

దాన్లోంచి పామొచ్చినట్టయి
అతను విసిరేస్తే
కుక్కి మంచంమీద
పొరలు విప్పుకొని
పసుపులో ముంచిన
కళ్ళ కలక గుడ్డలా
కన్నె కన్నుకి కాటుక చెరిగి
కామెర పట్టినట్టు
అసహ్యంగా
పడుంది అతను ముందు రాత్రి
షాపు ట్యూబులైట్లు
కళ్ళలో గుచ్చుకొని
రంగుల బేధం
తెలియక
కొన్న
పచ్చచీర

❖ ❖ ❖

ఆ చీర కింద
పుని స్త్రీ శవం పడుకున్నట్లయి
అతనికి
కన్నీళ్ళొచ్చేయి.

**(1976)**

# జాలీ నోట్

**నా**కు దెయ్యం అంటే భయం లేదు, దేవుడంటే భక్తీలేదు.

పావూ, దొంగా వగైరాలంటే కేరే జాట్.

"మరీ యింత భయభక్తుల్లేకుండా తయారైందేవిటమ్మా యీ పిల్ల! అసలే ఆడపిల్ల కూడాను" అని నా చిన్నప్పుడుమా అమ్మ తెగ బెంగ పెట్టుకునేది.

కాని నాలొసుగు ఆవిడకి తెలీదు. నాకు వర్షం అంటే విపరీత మైన భయం. భూమ్మీద చినుకుపడితే మరింక నేను భూమ్మీద కాలు పెట్టను. "అంటు" "సొంటు" అంటూ మా అమ్మ ఆరవక పోతే అన్నం కూడా మంచం మీదే తినేస్తాను.

అప్పటికి రెండ్రోజుల నుండి ఆగకుండా వర్షం కురుస్తోంది. సూర్యుడనేవాడు ఉన్నాడన్న సంగతే మరిచిపోయేం. మరింత ఈ వర్షం యిలాగే యింకో నాలుగు రోజులు గనక పడితే మనుషులంతా నానిపోయి మొక్క మొలచి పోతారేమో నన్న భయం పట్టుకుంది అందరికీ.

అదిగో, సరిగ్గా అప్పుడే నేను రైల్వే స్టేషన్‌కి వెళ్ళవలసి వచ్చింది. మామూలుగా అయితే ఆ పరిస్థితులలో దేవుడు ప్రత్యక్షం అవుతానన్నా దర్శనం యివ్వను. కాని ఆ వస్తున్నది పతి దేవుడు. నాకు వర్షం అంటే ఎంత భయమో మా వారంటే అంతకు రెట్టింపు వణుకు.

"ఇంత వర్షంలో స్టేషను కెందుకే. స్టేషను నుంచి ఇంటికి రాడా ఏవిటి! మరీ చాదస్తం" మా అమ్మ భయం. ఎంతైనా తల్లి ప్రాణం.

రాకపోయినా పోవచ్చు. ఏ మొగుడి సంగతి ఆ పెళ్ళానికే తెలుస్తుంది. నాకు చిన్నప్పటి నుంచి వర్షం అంటే ఏదో తెలీని భయం ఏర్పడబట్టి కాని లేకపోతే ఇన్నేళ్ళు మావారితో కాపురం చేసిన నాకీ తుపానొక లెక్కకాదు.

ధైర్యం, చీరాకూడ దీసుకు బయలుదేరేను. నా వెర్రి కాని యీ టైములో రిక్షా లెక్కడ దొరుకుతాయి? కనుచూపులో ఎక్కడా జన సంచారం లేదు.

ప్రళయం తరువాత ప్రశాంతతలా అంతా నిర్మానుష్యంగా ఉంది.